

## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపంరంజిల్లాలి!
ముజ్జగాలు సాయిమహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి! ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు సర్వత్రా
వ్యాపించాలి! ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటిదైవంబు లేడోయి లేడోయి!'అని
అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించటమే మనం చేయగలిగింది, చేయవలసింది.

-- శ్రీ బాబూజీ

## ఈ సంచికలో


| | | | |
|---|---|---|---|
| 1. | సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి!! | శ్రీ బాబూజీ | -- 2 |
| 2. | ఉన్నమాట - అనుకున్న మాట | గురుబంధువులు | -- 3 |
| 3. | అవసరమే అర్హతగా - అనుగ్రహమే అండదండగా | కె. వేదవతి | -- 5 |
| 4. | నా మార్గదర్శి - నా గురువే! | టి. రామకృష్ణ | -- 7 |
| 5. | చర్యకొక చరితం - సద్గురులీలా ప్రభోధం | లక్ష్మి | -- 9 |
| 6. | చిన్న చిన్న చినుకులే ప్రవాహమై నదిగా మారు | వి. కృష్ణవేణి | -- 10 |
| 7. | ఏది కోరిక, ఏది మేలిక... | జనార్ధనరావు | -- 11 |
| 8. | సత్సంగమనే మధుర పక్వాన్నాన్ని ఎలా ఆస్వాదించాలో! | గురుబంధువు | -- 13 |
| 9. | సుఖంతో సౌఖ్యానికి బాట - ఆ బాటే గమ్యం చేర్చు | పి. స్వప్న | -- 15 |
| 11. | ఆచేయి ఎంత హాయి | డా॥ ఎస్. సాయివరప్రసాదరావు | -- 16 |
| 12. | మహనీయుల మహితోక్తులు | గురుచరణదాసుడు | -- 17 |
| 13. | స్వర్ణోత్సవ సుమంగా మనం ఏం సమర్పిద్దాం? | గురుకృప | -- 19 |





సంపుటి 6
సంచిక 4
త్రైమాసిక పత్రిక
అక్టోబరు 2003

**నిర్వహణ**
గురూజీ
ఆశీస్సులతో
గురుబంధువులు

**చిరునామా**
గురుకృప
22-1-50
గాంధీచౌక్
తెనాలి - 01

☎
08644
227194 (O)
231808 (R)

**ముద్రణ**
**SPAA** OFFSET
విశాఖపట్నం
✆ 2598801

**శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్‌కీ జై!**

**సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై!**

# గురుకృప

## ఉన్నమాట - అనుకున్నమాట

సాయినాథుని సద్భక్తులకు విజయదశమి శుభాకాంక్షలు. గురుదేవుల జన్మదినోత్సవ శుభాభివందనములను 'గురుకృప' ద్వారా తెలియజేస్తున్నాము. కలిపురుషుని దమించి తన రాజ్యంలో సంచరించ రాదని కట్టడి చేసారు పరీక్షిన్మహారాజు. కలిపురుషుడు భయపడి అయ్యా, తమరలా అంటే ఎలా? యుగధర్మ పాలనన్నదొకటుంది. నా ధర్మాన్ని నేను గూడా కర్తవ్యంగా భావించి నిర్వహించాలిగదా అంటే, యోచించి అయిదు తావులందు కలి నివసించటానికి అనుమతించాడట. మూడడుగుల చోటిస్తే ముల్లోకాలు ఆక్రమించిన వామనుని కన్నా కలి పురుషునికి అయిదు తావులందు అవకాశమిచ్చేసరికి అనంతంగా, అంతరాయం లేకుండా, అదుపు అడ్డులను ఛేదించుకొని తన విశ్వరూపాన్ని పెంచుతూ ఈ విశ్వమంతటినీ తన అధీనంలోకి తెచ్చుకొని అందరిని తన వారినిగా మార్చివేస్తున్నాడు. ఈ కలిపురుషుని శక్తి అనంతమైనది, అమోఘమైనది, అతీతమైనది. అతని ప్రధమ ప్రయత్నం సమ్మోహింపచేయడమే. లక్షలాదిమంది మానవాళి ఈ ప్రభావానికి లోనైపోతున్నారు. అతన్ని పారద్రోలు ప్రయత్నం కలియుగంలో ప్రస్తుతం ప్రధమపాదం అంతమై ద్వితియపాదం ఆరంభం కాబోయే తరుణంలో అది బహుశా సాధ్యపడకపోవచ్చు. అతని ప్రభావం మనమీద పడకుండా జాగ్రత్తపడవచ్చు. ప్రస్తుతం ఆ ప్రయత్నమే మనం చేయవల్సి ఉంది.

కలిపురుషుడు ఉక్కుకిరీటము, ఉక్కుభుజకీర్తులు, ఉక్కు పాద రక్షలను కలిగి లింగ, జిహ్వోదులను ప్రధాన సాధనంగా చేసికొని సంచరిస్తుంటాడు. కలియుగాంతం వరకు విభేదించడమన్నది కలి లక్షణం. వివాద, దుర్విమర్శ, నిందారోపణ, నేరారోపణ కలిప్రభావానికి లోనైనవే.





వీరు సత్యాన్ని గుర్తించలేరు. గుర్తించినా తమ స్వార్ధ ప్రయోజనాల దృష్ట్యా మరుగుపరుస్తారు. ఇతరులపై అబద్ధాలు చెప్తారు. తాము పరమ పవిత్రమైన పుణ్య ప్రదేశంలో ఉన్నప్పటికీ సంకోచం లేకుండా, సంశయించకుండా సన్నిహితుల విషయాలలోను వారు నేరాలనే చూపిస్తారు. క్షణాలమీద హితులను అహితులను గావించుకుంటారు. సద్గురు చరణ సన్నిధిలో గూడా అబద్ధాలు చెప్తారు. తమకు తెలియని అంశం గురించి, తమకే మాత్రం సంబంధంలేని విషయాలను తస్కరబుద్ధితో తర్కించుతారు. మానవ ధర్మాన్ని మర్చిపోయి తాత్కాలిక ప్రయోజనాలకు లోభివలె సంచరిస్తుంటారు. ఇలాంటి వారందరు కలిని ఆవహనం చేసుకొన్న వారే. ఒకసారి ఆహ్వానించిన తరువాత, అతను మనల్ని ఆక్రమించు కొనిన తరువాత, అతనినుండి, అతని ప్రభావం నుండి విడిపడిపోవాలంటే వీలుపడే విషయం కాదు సుమా!

మాట చెప్పిందే తడవుగా, ఇతరుల సంపదలను తమకోర్కెల మేరకు ఖర్చు చేయించడం, లోపల ఒకటి పెట్టుకొని బయటికొకటి మాట్లాడడం, కత్తులు కడుపులో దాచుకొని, పదిమంది ముందు ప్రేమగా ఆలింగనం చేసుకోవడం వంటివన్నీ కలిపురుషుని లక్షణాలే. తిరుమలలోని వేంకటేశ్వర స్వామి దర్శనానికై కుటుంబ సమేతంగా వెళ్ళడం అక్కడ అనూహ్యమైన రీతిలో మేం గురువుగారి దర్శనానికి వచ్చాం, అక్కడ వార్ని గూర్చి మాకెవరు చెప్పలేదండి అంటూ వగలుపోయే లక్షణాలు గూడా ఈ కోవలోనివే. వాళ్లు నిజంగా గురువుగార్నే చూడాలని వెళ్లితే గురుదర్శనం జరుగుతుందిగాని, వెంకన్నస్వామి దర్శనం ఎలా జరుగుతుంది. ఇదే లోనొకటి బైటొకటి అంటే ఇది కలిప్రభావమే. ఒక పక్షి ఆకాశమార్గాన ఓ పది నిమిషాల కాలం పాటు విహారం చేసింది. దానికవకాశమున్నంత వరకు. మరల క్రిందికి వచ్చి నేను ఆకాశాన్నంతటినీ చుట్టి వచ్చానంటే సరిపోతుందా? ఆకాశం కన్నా విశాలమైన గుర్వనుగ్రహాన్ని పొందాలి అంటే నీవెంతగా తపించాలో యోచించు. అంతేగాని పై పక్షిలా ఎగిరి వచ్చేస్తే సరిపోతుందా? నీ ధ్యాస, నీ ధ్యానము, నీ ధ్యేయమంతా గురువుపైననే కేంద్రీకృతమై ఉందా? అవసరంలోంచి వచ్చిన భక్తా? ఆవేదనలోంచి వచ్చిన భక్తా? ఆర్తిలోంచి పుట్టిన భక్తా? నిజంగా చూడటానికి తహతహలాడుతున్నామా! ఆత్మవంచన చేసుకోకు సుమా! కలిపురుషుడావహిస్తాడు. అతని ప్రభావం ఉంది కాబట్టి.

ఆయుఃప్రమాణం తగ్గిపోతుంది. ఉగ్రరోగాలకు నిలయమైపోతుంది. మానసిక స్థితి దిగజారి పోతుంది. అలసత్వం ఆవరించి సోమరిపోతుగా తయారైపోతాడు. మందబుద్ధిగా మారిపోతాడు విపన్న భావనతో ధైర్యాన్ని కోల్పోతాడు. కావున గురుబంధువులారా నిరంతర గురునామ చింతనతో కలియుగంలో సంప్రాప్తమయ్యే దుష్టగుణాల మహిషాసురుని గుర్తించి, మనల్ని రక్షించేది గురు చరణ సన్నిధే. గురునామాన్ని విశాలమైన భావనలతో, భక్తి శ్రద్ధలతో జపించి, ఆస్వామిని సేవించి, తరించుదాం. విజయదశమిన విజయవంతంచేసే సాధనను చేపడదాం!





# అవసరమే అర్హతగా - అనుగ్రహమే అండదండగా

'బాబా బోధ సమగ్రమైనదే - మన అవగాహనే సమగ్రం కావాల్సి ఉంది' అన్న గురుదేవుల మాటల్లోని ఆంతర్యం గమనిద్దాం. బాబా బోధ అంటూ మనకు లభించింది కేవలం మనం వారిచెంతన వుండి అర్హతల 'ఆరోహణ', 'అవరోహణ' క్రమంలో కాకుండా అయాచితంగా అనుగ్రహాన్ని గ్రోలిన భక్తుల అనుభవాలేనని (బాబూజీ) గురుదేవుల మాట! కొందరి భక్తుల యోగ క్షేమాల కొరకు మరికొందరు భక్తుల్ని పంపి సిఫార్సు చేయించిన సందర్భాలు ఉన్నాయి. అయితే అసలైన సిఫార్సు ఏది? ఇక మనకు ఆదిగ్రంథమైన బాబా చరిత్రను గమనిద్దాం. నార్కే మాటల్లో బాబా తనను అనుగ్రహించిన తీరు "సం॥ 1917లో పూణేలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయపదవికి అర్జీ పెట్టుకోవాలా అని అడిగితే బాబా పెట్టుకోమన్నారు. ఆ ఉద్యోగానికి సంబంధించిన వారిని కలుసుకోవడానికి నేను పూణే వెళ్ళాను. పెద్ద సిఫార్సులతో ఆ పదవికి ఎన్నో దరఖాస్తులు వచ్చాయి. నా పరిస్థితి కష్టంగా ఉన్నది. భక్తులతో బాబా 'భగవంతుడు అనుగ్రహిస్తాడు' అన్నారట, నాకు 1918లో ఆ ఉద్యోగమొచ్చి 1919లో స్థిరమైంది". నాడు నార్కేకు 'భగవంతుడు' బాబా! అదే రీతిన అర్హతలతో, అధికారులతో, అండదండలతో పనిలేకుండా కేవలం 'అనుగ్రహంతో' ఒక (ఉద్యోగిని) గురుబంధువును అనుగ్రహించిన తీరుతో మనకు భగవంతుడెవరో తెలుసుకుందాం. - గురుకృప

నా పేరు ఆర్. వేదవతి. నేను గత 7 సంవత్సరాలనుండి బస్సు సౌకర్యంలేని, వర్షంపడితే నడవడానికి వీలులేని రోడ్డుగల విక్కిరాల పేట అనే పల్లెటూరిలో, స్కూలు టీచరుగా పనిచేస్తున్నాను. రోజూ కందుకూరునుండి విక్కిరాల పేట వెళ్లిరావాలంటే చాలా ఇబ్బందిగా ఉండేది. ఆ ఊరుకు వెళ్లడమూ కష్టమే, రావడమూ కష్టమే. బస్సు సౌకర్యం చాలా తక్కువ. వచ్చిన రోజు వచ్చినట్లు, రాని రోజున ఇక రావు. ఆఖరికి ఒకొక్కసారి ఇసుక ట్రాక్టర్ మీద రావలసి వస్తుండేది. ఆ రోజు ఒళ్ళు అంతా హూనం అయ్యేది. ఇలా చెప్పనలవికాని ఇబ్బందులు ఉండేవి. ఇది ఒక సమస్యగా ఉంటే, ఆ ఊరివాళ్ళు ఈ స్కూలు టీచరు టైముకు రావడం లేదని అధికారులకు ఫిర్యాదులు చేసేవారు. ఇక నాకు ఏడుపు ఒకటే తక్కువ. మేము చేయగలిగిన అన్ని ప్రయత్నాలు, (రాజకీయ నాయకులను కలిస్తే - మీరు మా పార్టీకాదు అనే మాట) ఇలా ఎన్నో, ఒక్క ప్రయత్నం కూడా ఫలితమివ్వలేదు. ఏమి చేయలేక అలసిపోయిన నాకు అప్పుడు గుర్తుకు వచ్చింది - "నాకు వున్న దిక్కు గురుదేవులొక్కరే" అన్న విషయం. ఇది గుర్తుకు రావడానికి నా ప్రయత్నాల విఫలమే కారణం. గురువుగారికి మొదటిసారిగా తెలియపరచటం కోసం లెటరు వ్రాసుకున్నాను. తరువాత గురుదేవుల దర్శనం కోసం వెళుతున్న మావారితో నాకున్న ఈ ఇబ్బందిని గూర్చి గురుదేవులకు తెలియ చేయమన్నాను. వారు వెళ్ళి గురుదేవులతో ఇలా చెప్పారట. "గురుదేవా! నా భార్య విక్కిరాల పేట అనే పల్లెటూరిలో పనిచేస్తూ, బస్సు సౌకర్యం లేక చాలా ఇబ్బంది పడుతుంది. ఆమెను మంచి చోటుకి (ఇబ్బందిలేని) మీదయతో ట్రాన్స్ఫర్ చేయండి. మాకు సహాయం చేసేవారు మీరు తప్ప





ఎవరూ లేరు." అంతా విన్న గురుదేవులు ఒక్కమాట అన్నారు. ఆ మాట **'సరే'** అని. నాకు ఆ మాటకర్థం బోధపడలేదు. గురుదేవుల పాదదర్శనం చేసుకొని బయటకు వచ్చేసాను. నాకు అనిపించింది ఇంతసేపు చెప్పాను, గురుదేవులు అంతావిని 'సరే' అన్నారు అనుకొని, ఏదిఏమైనా ఆ మహాత్ముడే చేయాలి. ఆయన దయ అని తన మనస్సుకు ధైర్యం చెప్పకుని ఇంటికి వచ్చి నాతో చెప్పారు. అంతా విన్న నాకు ఆమాట కర్థంబోధ పడకపోవడంతో నీరసం ఆవహించింది. ఇక గురుదేవులదయే అనుకున్నాను. ఇది జరిగిన వారం రోజులకు ఉన్నట్లుండి ఇ.ఓ. గారు మా ఇంటికి వచ్చి నన్ను ఒంగోలు ఆఫీసుకు ఆరోజునే రమ్మని చెప్పి వెళ్లిపోయారు. మన గురుబంధువు అయిన మూర్తి గారింటికి మా వారు వెళ్లడంతో మూర్తిగారికి ఫోన్ చేసి మావారిని అర్జంటుగా ఇంటికి రమ్మని, ఒంగోలు వెళ్లాలని చెప్పాను. నేను, మావారు కలసి ఒంగోలు వెళ్లడం జరిగింది. అక్కడ జరిగిన విషయం, మండలంలో యాక్టివ్‌గా ఉండే లేడీగా నన్ను ఎంపిక చేసి ఎం.ఇ.ఓ, ఎం.డి.ఓ. గారు నన్ను ఆఫీసర్‌గా ఎంపిక చేసారు. నాకు చెప్పకుండా వాళ్లే నిర్ణయం తీసుకుని జాయినింగ్ ఆర్డర్ ఇచ్చారు. టైంకి సరిగారాదు అన్న ఫిర్యాదులు ఉన్న నన్ను ఆఫీసర్‌గా చేసారంటే ఇది గురుదేవుల అనుగ్రహమే. ఒక టీచరుని ఆఫీసర్‌ని చేయించింది వాళ్లచేత గురుదేవులే.

గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా ప్రమోషన్‌తో ఆర్డర్ చేతికిచ్చారు. నేను, మావారు ఒక్కసారిగా మేము ఊహించనది కాబట్టి ఆశ్చర్యపడ్డాము. అడిగింది ట్రాన్స్‌ఫర్, ట్రాన్స్‌ఫర్‌తో పాటు ప్రమోషన్ ఇప్పించింది **'సరే'** అన్న గురూజీ మాట. వారి నోట వెలువడ్డ "సరే" అన్న మాటలో ఇంత ఆంతర్యం దాగివుందని అవగతమైంది. ఇక ఆనందం మావంతు. తక్షణమే గురుదేవులకు హృదయ పూర్వక నమస్కారాలు తెలియ చేసుకున్నాము ఎంత గొప్ప సహాయం చేసావు తండ్రి అని అనుకున్నాము. కేవలం ట్రాన్స్‌ఫర్ కోసంగా మొదలైన మా ప్రయత్నాలు విఫలమై, నాకు సౌఖ్యాన్ని చేకూర్చడం కోసం ఏకంగా ఒక పోస్ట్‌ను సృష్టించి కందుకూరు టౌన్‌లో, ఇంటినుండి అడుగుతీసి అడుగు పెట్టేంత దూరంలో ఉన్న మండల ఆఫీసులో ఒక ప్రత్యేక సీటుతో, అన్ని సౌకర్యాలతో నాకు ప్రమోషన్ ఇప్పించిన గురుదేవుల అనుగ్రహానికి అచ్చెరువొందాము. కేవలం వారి నోటి నుండి వెలువడ్డ సరే అన్న అక్షరాలతో లక్షలరెట్లు అనుగ్రహాన్ని ప్రసాదించిన వారిని కీర్తించడానికి నోటిమాటలు రాక, లేక మూగపోయాము. స్థానిక ఎమ్.ఎల్.ఏ.కు సంబంధించిన మనిషి ఉండగా నాకు ఆ పోస్టు ఇవ్వడం, దాని గూర్చి ఆ ఎమ్.ఎల్.ఏ. నా పై ఆఫీసర్‌లతో వాదించడమే, గురుదేవుల అనుగ్రహానికి నిదర్శనం. అందరి యజమాని అయిన సద్గురువే నేరుగా ఆర్డరు వేయించారు. ఇంతటి అద్భుత సద్గురువును ప్రసాదించిన బాబాకు మా హృదయ పూర్వక సాష్టాంగ నమస్కారముచేసుకుంటున్నాము. భక్తుల కష్టాలు ఏవి చెప్పకున్నా క్షణంలో ప్రసన్నతను చూపే కరుణామూర్తి అయిన గురుదేవుల పాద పద్మములకు సాష్టాంగ నమస్కారములు తెలియ చేసుకుంటున్నాము.

కె. వేదవతి
కందుకూరు.





# నా మార్గదర్శి - నాగురువే!

**సద్గురు లీలా ప్రబోధం కొనసాగుతూనే ఉంటుంది. "శ్రీసాయి నోట యథాలాపంగానైనా పలికిన ప్రతి పలుకు ఒక శృతి వాక్యమాయనకు" అన్న మాటలు ఆ సద్గురు చంద్రుని జీవితంలో వారి ఆచరణతో మనకు తేటతెల్లం చేసి, 'మనిషి దైవంగా పెరగటం' అన్న బాబా తత్వాన్ని జగమెరిగిన సత్యంగా ప్రబోధించారు. అయితే, ఈనాడు మనం గురుదేవుల నోటినుండి వెలువడిన మాటల్లో కనీసంగానైనా ఒక్క వాక్యానైనా గమనించుకొనే ప్రయత్నం చేస్తున్నామా? "జీవిత విధానాన్ని ఆనందకరంగా మార్చుకొనే ప్రయత్నంలో ఎదురయ్యే ఇబ్బందులను చూసి క్రుంగిపోవద్దు. మనకు సులభంగా, ఇబ్బంది లేకుండా ఉండి మనకు తెలిసిన వాటిపైననే మనం ఆధారపడితే మనం జీవితం నుంచి ఏం నేర్చుకుంటాం?" అన్న గురుదేవుల వాక్కును గమనిద్దాం. జీవిత గమనంలో ఎదురయ్యే ప్రతి సంఘటన నుంచి వారి ప్రభోదాన్ని అందుకునే ప్రయత్నం చేద్దాం. ఇందు ఒక్క విషయం మాత్రం మరువద్దు, "Oh yet, We trust that somehow good will be the final goal of ill", "ఏ సంకటమైనా సుఖాంతమవుతుందనే మా నమ్మకం" - Tennyson మనమొచ్చింది మిఠాయిలు పంచే దేవుని వద్దకే! అందు సందేహంలేదు. అయితే నేర్చుకునే ధృక్పథమే ఉంటే జీవితంలో జరిగే ప్రతి సంఘటన సద్గురు లీలా ప్రభోదమే!**

**- గురుకృప**

నా పేరు టి. రామకృష్ణ. నాకు మార్గదర్శకులు గురుదేవులే. ఆయన ఏదిచెబితే అది చేయటమే నాకు ఇష్టమైన పని. ఇప్పటి వరకు నాకున్న అనుభవాలలో మీతో ఒకటి పంచుకుంటాను. ఇది చదివిన తరువాత గురువుగారు మన వెనక ఉండి మనకు ఎలా తోడ్పడతారు అనేది తెలుస్తుంది.

నేను నవంబరు, 2001లో ఒకసారి గురువుగారి దర్శనం కోసం శిరిడి వెళ్ళాను. అప్పటికి నా ఉద్యోగము కొంచెము ఇబ్బందిగా ఉంది. నేను పనిచేస్తున్న ఆఫీసులో ఇన్‌కమ్ టాక్స్ రైడింగ్ జరిగింది. కొంచెము చికాకుగా ఉంది, నా ఉద్యోగం ఏమవుతుందో అనేబాధ. సరే ఏది అయితే అది అని అనుకుని గురువుగార్ని అడిగి తెలుసుకొని దాని ప్రకారము చెయ్యాలి అని శిరిడి వెళ్లాను. కాని అనుకోకుండా గురువుగారు ముందురోజు పాదదర్శనము ఇచ్చారట. నేను చాలా బాధ పడ్డాను. కాని ఆ తరువాత రోజు గురువుగారు ఊరు బయలు దేరుతున్న సమయము లో నేను కారు దగ్గర గురువుగారిని అడిగాను. నన్ను ఏమి చెయ్యమంటారు? అని.

గురువుగారు మెయిల్ చెయ్యి అని చెప్పారు. కాని అది పూర్తిగా వినబడని కారణంగా మళ్ళీ డౌట్‌గా అడిగాను. కాని చివరకు మెయిల్ చెయ్యమన్నారని అర్థం అయింది. సరే అనుకొని శిరిడి నుండి హైదరాబాద్ వచ్చాను. ఇంకా ఆఫీసులో ఇన్‌కమ్ టాక్స్ డిపార్టుమెంటు వాళ్లు రైడింగ్ చేస్తున్నారు. మా కంప్యూటర్స్ అన్నీ రూములో పెట్టి తాళం వేశారు. కాని ఆఫీసుకు వెళ్ళాలి కదా! వెళుతున్నాను, వస్తున్నాను. కాని అక్కడ వేరే జాబ్ లేదు, ఇది తప్ప. ప్రయత్నము చేసినా జాబ్ దొరకలేదు.





కొన్ని రోజులు పోయిన తరువాత గురువుగారు చెప్పారు కదా మెయిల్ చెయ్యమని అనుకొని ఆఫీసులో జరిగినది అంతా గురువుగారికి మెయిల్ ఇచ్చాను. మెయిల్ ఇచ్చిన కొన్ని రోజుల తరువాత ఇన్‌కమ్ టాక్స్ వాళ్ళు మాకు సిస్టమ్స్ ఇవ్వడానికి ఒప్పుకున్నారు. సరే ఈ మధ్యలో మా ప్రాజెక్టు మేనేజర్ మీద వాళ్ళు కేసు బుక్ చేసారు. ఆయనను ఆఫీసువాళ్ళు పనిమీద బెంగుళూరు పంపించి వున్నారు. ఆఫీసులో ఎవరూ లేరు. గురువుగార్కి ఈ విషయాలతో మరల మెయిల్ ఇచ్చాను. అంతా వివరంగా వ్రాశాను. ఇది ఇచ్చిన కొన్ని రోజులకి మళ్లీ మాకు క్రొత్త హార్డ్‌డిస్క్‌లు, ఇలా ఒకదాని తరువాత ఒకటి రావటం జరిగింది. దీపావళి తరువాత వర్క్ మొదలు పెడదాము అని అనుకున్నాము. ఇన్‌కమ్ టాక్స్ వాళ్ళు రావటం పూర్తిగా మానేశారు. మా సిస్టమ్స్ అన్నింటిని రెడీ చేస్తున్నాము. ఈ సందర్భములో మా ఆఫీసు ఎమ్.డి. తో కలిసి మా సేలరీ విషయము గురించి అడిగాము. అయితే ఆయన ఇంక మనకు ఏ ఇబ్బంది లేదు, మీ ప్రాజెక్టు మేనేజర్ రాగానే మీకు మీ సేలరీ ఎరేంజ్ చేస్తాను అని అన్నారు. కొన్ని రోజులు గడిచినా మా ప్రాజెక్టు మేనేజర్ రావటము లేదు, మాకు వర్క్ చెయ్యాలి అనిపించటములేదు. ఇదే సమయానికి ఇంట్లోని పరిస్థితుల వల్ల చికాకులు. ఈ సందర్భంలో మళ్లీ గురువుగారికి 3వ సారి మెయిల్ ఇచ్చాను. ఇందులో నేను కోరుకొన్నది - "మా ఎమ్.డి. మాకు జీతము ఇస్తాను అని అన్నారు. ఇంతవరకు జీతము లేకుండానే అతి తక్కువ జీతముకి మేము చేస్తున్నాము. మీ అనుగ్రహంతో మాకు రూ. 4000/- లు సేలరీ ఇప్పిస్తే బాగుంటుంది" అని వేడుకున్నాను.

ఇది ఇచ్చిన చాలా కొద్ది రోజులకే 3 నెలలుగా వేరే ఊరిలో ఉండి ఇక రాడనుకున్న వ్యక్తి (మేనేజర్) రావలసిన టైమ్‌కన్నా ముందుగా రావడం మాకు ఆశ్చర్యం కలిగించింది. ఆయన రాగానే మేము అడగకుండానే సేలరీ విషయము మాతో మాట్లాడారు.

మేము జరిగింది అంతా చెప్పాము. ఆయన వెంటనే మా ఎమ్.డి. తో మాట్లాడడము జరిగింది. చివరికి మాకు తెలియకుండా మా ఎమ్.డి. మాకు సేలరీ రూ. 3,500/-గా ఫిక్స్ చేసారు. ఇది మా ప్రాజెక్టు మేనేజర్ కూడా చూడలేదు. చివరి టైములో ఆ బిల్ అకౌంట్స్ సెక్షన్‌కు వెళ్లేముందు మా ప్రాజెక్టు మేనేజర్ ఎందుకు చూశారో, చూసిన వెంటనే దానిని అకౌంట్స్ సెక్షన్‌లో రూ. 4,000/- గా మార్పు చేయించారు. మేము అంతకుముందు ఆయనతో రూ. 4,000/- లు సేలరీ కావాలని చెప్పలేదు. ఆయన ఎంత ఇమ్మంటారు అని అడగలేదు, గురువుగారితో చెప్పకున్నానే తప్ప! ఏమి అడక్కుండా ఆయన అంతట ఆయనే రూ. 4,000/-గా సేలరీ మార్చి మాకు ఇప్పించటం అన్నది - గురుదేవుల అనుగ్రహసంకల్పమే. ఇది నిజముగా "గురుసంకల్పం అన్ని జీవులలోను చైతన్యం కల్గిస్తుందనే" దానికి నిరూపణగా తోస్తుంది. ఈ అనుభవం ద్వారా నాకు ఆనందాన్ని, జీవితంలో సౌఖ్యాన్ని ప్రసాదించిన గురువుగార్కి నా హృదయ పూర్వక నమస్సుమాంజలి అర్పించుకుంటున్నాను.

టి. రామకృష్ణ





# చర్యకొక చరితం - సద్గురులీలా ప్రభోధం

'నా చర్యలు అగాధాలు' అన్న (సద్గురు) బాబా మాటకు, బాటకు మనం ఈ రోజు చూస్తున్న నిజరూపం బాబూజీ. బాబా తత్త్వాన్ని పుణికి పుచ్చుకున్న ఒక మహనీయుని మాటలో చెప్పాలంటే, బాబాలాగా నవ్వగలగాలంటే 'బాబాలాగ జీవించగలగాలి'. అలాంటి నవ్వు కోసం 'ఎన్ని సంవత్సరాలైనా షిర్డిలో ఉండవచ్చు' అని అన్నారు ఖాపర్డే. బాబా చర్యలనే అగాధపు అంచులను తాకిన గురుదేవుల చర్యలు నన్ను, నా కొచ్చిన కష్టాన్ని నేను మరవడమేకాక, ఆ 'కష్టం' కూడా నన్ను మరిచిపోయేట్లు చేసింది. 'బాబూజీ' అన్న శీర్షికలో 'కేవలం వారి చూపుతో, స్పర్శతో...' అన్న వాక్యాలకు నా అనుభవం సాక్షీభూతంగా నిలిచింది. బిడ్డను కాపాడటానికై తన చేతిని ధునిలో పెట్టిన బాబా, మరో సందర్భంలో కేవలం తన నోటి మాటతో పైకెక్కుతున్న విషాన్ని, శరీరం నుండి విడుదల గావించడం చూస్తాం. సద్గురువు చేసే ప్రతీ చర్య ఒక చరితమే! వారి ప్రతీ చర్యలోనూ జరిగేది రక్షణే, ఉద్దరణే.

నా పేరు లక్ష్మి, నేను మొన్న (2002) గురుపౌర్ణమికి వెళ్లినప్పటి అనుభవాలు. నేను చాలా బాధల్లో వుండి షిరిడీకి వెళ్ళినాను. గురుదేవుల దగ్గర తల్లిప్రేమ కంటే ఎక్కువ ప్రేమను పొందినాను. ఆ ప్రేమ, కరుణ, దేనితోను పోల్చలేనటువంటివి. నేను పొందినటువంటి అనుభవాలు మాటల్లో చెప్పలేనివి. నేను పొందిన ఒక అనుభవం మీతో పంచుకొంటున్నాను. నాకు గురుదేవులను, అమ్మగారిని కలసి చూడాలని ఉండేది. గురుపౌర్ణమి తరువాత ఒక రోజు తెల్లవారు జామున 4 గం॥లకు నేను, రత్తయ్య గారు, జగన్ మోహన్ రెడ్డిగారు, ఇంకా ఇద్దరం కలసి నగరసంకీర్తనకు వెళ్ళినాము. 5 గం॥లకు ఆశ్రమానికి వచ్చినాము. అప్పడు రత్తయ్యగారు, రెడ్డిగారు, అంతాకలసి రూములకు వెళ్ళిపోయినారు. నేను ఆశ్రమం, వూడ్చి, నీళ్ళుచల్లి, ముగ్గుపెట్టాలి అని వుండిపోయినాను. నేను, సుష్మ, జయశ్రీ, ఇంకో అమ్మాయి మొత్తం నలుగురం కలసి పని చేస్తున్నాము. అప్పడు అనుకోకుండా గురువుగారు బయటకు వచ్చినారు. పిల్లలు పరిగెత్తినారు. నేను కూడా వాళ్ళతో కలసి చూసినాను. గురుదేవులు కారులో మందిరానికి వెళ్ళినారు. నేను ఆ కారుని అనుసరించాను. అప్పటికే గురుదేవులు ద్వారకామాయిలో ధుని దగ్గర నమస్కారం చేసుకొని, బాబా దగ్గర తలవంచి నమస్కారం చేసుకొని, క్రింద మెట్టు దగ్గర వంగి నమస్కారం చేసుకొని, రెండడుగులు ముందుకి వచ్చి అక్కడ కూర్చుని ధ్యానం చేసుకొన్నారు. రెండు మూడు నిమిషాలు ఇది అంతా, నేను గేటు గుమ్మంలో నుంచుని చూసినాను. అమ్మగారిని, గురువుగారిని, పాపను కలిసి చూసినాను, నా జన్మ తరించింది. మళ్ళీ కారు ఎక్కుతుండగా దగ్గరకు వెళ్ళినాను, నావైపుచూసి చిన్నగా తల ఆడించినారు. మళ్ళీ రెండవ రోజు అదే టైములో మందిరమునుంచి తిరిగి ఆశ్రమానికి వచ్చినారు. నేను అదే టైములో నగరసంకీర్తన నుంచి తిరిగి ఆశ్రమానికి వచ్చినాను. నేను గురువుగారి దర్శనం, పాదనమస్కారం చేసుకున్నాను. గురువుగారు చూసిన చూపుకి చెప్పలేని ఆనందం కలిగింది. ఇలాంటి అనుభవం మాటల్లో చెప్పలేను. ఇలా మనసులో ఆలోచనరాగానే గురుదేవులు





అలా వెంటనే తీర్చినారు, ఇంతకంటే ఏమి కావాలి. అసలు గురువుగారు బాబాను ఎంత చక్కగా దర్శనం చేసుకొని, ఎంత చక్కగా నడిచి వచ్చినారో చెప్పలేను చూడవలసిందే. గురువును అంటిపెట్టుకొని వుండాలి, గురువుకి పగ్గాలు అప్పగించాలి అనే వారు. నాకు ఇది అంతా తెలిసేదికాదు. గురువుగారే ఆయన ఇచ్చిన అనుభవాల ద్వారా తెలియచేసారు. వారి చూపుతో నాకొచ్చిన కష్టాన్ని నేను మరిచాననుకున్నాను ఆ సమయానికి, కానీ చివరకు అవగతమైంది ఆ 'కష్టమే' నన్ను వదిలివెళ్ళిందని తెలుసుకున్నాను. నేను ఇంటికి వచ్చేసరికి అన్ని సమస్యలు తీరినవి. వారి సన్నిధిలో లభించిన ఆనందం, వారి సన్నిధిని వీడినా పోకుండా ఉండేందుకు నా ఆ కష్టాన్ని మా ఊరికి చేరేలోగా తీర్చారు.

లక్ష్మి వైజాగ్

## చిన్న చిన్న చినుకులే ప్రవాహమై నదిగా మారు

పూజ్య గురుదేవులకు నమస్కారములు తెలుపుకుంటూ, గురుమహిమ వలన జరిగిన అనుభవమును మన గురుబంధువులకు తెలుపుకుంటున్నాను. మేము విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు దగ్గర కూర్మన్నపాలెంలో ఉంటున్నాము. మా దగ్గరలో ఉన్న మా పెద్దమ్మగారి ఇంటి దగ్గర ప్రతి గురువారము సత్సంగము జరుగుతూ ఉంటుంది. నేను వెళుతూ ఉంటాను. సత్సంగానికి వెళ్ళటం వలన తెలియని విషయములు తెలుసుకున్నాను. అప్పటినుండి నేను గురువుగారినే నమ్ముకున్నాను. మా బాబు లోకేష్‌వర్మ డీఫాల్ స్కూల్లో 7వ తరగతి చదువుతున్నాడు. వాడు ఎప్పడూ చదువు విషయములో డల్‌గా ఉండేవాడు. 3నెలల, 6 నెలల పరీక్షలలోను, హోప్‌టెస్టులలో కూడా ఏ సబ్జెక్టులోనూ పాస్‌మార్కులు వచ్చేవికావు. చదివించి పంపినా వెంటనే మర్చిపోయేవాడు. ఇట్లా అయితే ఫైనల్ ఎగ్జామ్స్‌కి పంపించము అని టీచర్స్ దగ్గర నుండి రిపోర్టులు వచ్చేవి. ఆ సంవత్సరమంతా నేనూ, మా బాబు కూడా చాలా టెన్షన్‌తో ఉన్నాము. సత్సంగములో, ఇంట్లోకూడా రోజూ గురువుగార్కి ఈ విషయము చెప్పకుండేదాన్ని. ఫైనల్ ఎగ్జామ్స్ అయిపోయిన తరువాత మాఅమ్మ శిరిడి వెళుతుంటే నాకు వీలు కుదరక మాబాబుని అమ్మతో షిరిడీ పంపించాను. అక్కడ చాలా సంతోషంగా గురువుగారి దర్శనం అయ్యింది. మా బాబు కూడా నేను పాసవ్వాలని గురువుగారితో చెప్పకున్నాడు. గురువుగారు బాబు తలపై చెయ్యివేసారట. ఆ మరుసటిరోజే 7వ తరగతి పరీక్షా ఫలితాలు వచ్చాయి. మా బాబు 384 మార్కులతో ఫస్టుక్లాసులో పాసయ్యాడని తెలిసింది. నా ఆనందానికి అంతులేదు. మా బాబు గురువుగారి దర్శనం చాలా బాగా అయింది అని షిరిడీ నుండి ఫోన్ చేసాడు, నేను వెంటనే ఆనందంతో నువ్వు ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయ్యావని వాడికి చెప్పాను. మేము అందరము చాలా సంతోషించాము. పాసయితే చాలు అనుకునే మాకు. ఫస్ట్‌క్లాస్ రావడం వలన ఎన్నడు ఊహించని ఆనందాన్ని పొందాము.

వి. కృష్ణవేణి, కూర్మన్న పాలెం.





## ఏది కోరిక, ఏది మేలిక.... నీవే మము కాపాడుపలిక, లేదు నీ కరుణకు పోలిక!

ప్రియ గురుబంధువులకు,

తన సర్వస్వం తన స్వామేనని భావించిన పోతనామాత్యుడు **'నాకేది మంచో, నాకేది చెరుపో నాకంటే బాగుగా నా స్వామికెరుక'** అంటూ తన దేవాధిదేవుణ్ణి కీర్తించుకున్నాడు. అలా శరణాగతి చెందిన పోతనామాత్యుడు పరమ భాగవతోత్తముడయ్యాడు. శరణాగతి పథం లో 'తప్పటడుగులు' వేస్తున్న నన్ను మన గురుదేవులు అనుగ్రహంతో అనుక్షణం ఆదుకుంటున్న తీరు...

వాల్తేరులో 'ఫైనాన్స్' వ్యాపారం చేస్తూ, కొన్ని ఒడిదుడుకులకులోనై ఆ వృత్తిని వదిలిపెట్టవలసి వచ్చింది. ఉన్న పరిస్థితులకు 'వాల్తేరు'ను కూడా వదిలి ఎక్కడైనా వేరే జాబ్ వెతుక్కుందామన్న ఆలోచనతో, నాకిష్టమైన బెంగుళూరుకు వెళ్ళదలచుకున్నాను. 'ఏదో ఒకటి చేద్దామన్న' ఆలోచనే తప్ప, ఎటువంటి రికమండేషన్ (సిఫార్సు) లేకుండానే బెంగుళూరు చేరాను.

సద్గురు అనుగ్రహపు జల్లు కురవడం ప్రారంభమయింది. మొదట కన్నడం, తర్వాత తెలుగులో మాట్లాడి ఆటో అతను ఒక మంచి డార్మిటరీ వద్ద దించాడు. కొందరు వ్యక్తుల ద్వారా అక్కడి నాగరికమైన (సంస్థలున్న) ఏరియాల గురించి ఎంక్వైరీ చేసి తెలుసుకున్నాను. ఇక్కడ జీవనం సాగించటానికి 'ఆంధ్రా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్' పెడితే బాగుంటుందని వ్యక్తిగతంగా చేసిన సర్వేలో తేల్చుకున్నాను. మొదటి రెండురోజులు తృప్తిగా భోజనం చేయలేదు. ఆంధ్రాభోజనం ఆలోచన రాగానే ఎవరో నందిని హోటల్‌కి వెళ్ళమన్నారు.

నందిని హోటల్‌లో భోజనం చేస్తున్న నాకు అదే హోటల్‌లో ఏదైనా ఉద్యోగం వచ్చి, కొంత నిలదొక్కుకున్న తర్వాత సొంత ఆలోచనలు చేద్దామన్న తలంపు కలిగింది. భోజనం అయిన తర్వాత అక్కడి మేనేజరు గదికి వెళ్ళి నాకేదైనా ఉద్యోగావకాశం ఇప్పించమని అడిగాను. అతను, ఉద్యోగం కావాలంటే వాళ్ళ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ రవిగారిని అక్కడికి రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్రాంచి ఆఫీసులో కలవమన్నారు. అక్కడికి వెళ్ళిన నాకు 'నో వేకెన్సీస్' బోర్డు ఎదురైంది. అక్కడ ఒక వ్యక్తి నన్ను ఏం కావాలని అడిగాడు? నేను అతనికి నా పరిస్థితి చెప్పగా, అతను హోటల్ స్టాఫ్‌లోని ఎవరో ఒకరు సిఫార్సు చేస్తే ఉద్యోగం ఇస్తారని చెప్పాడు. గురువుగారు పరిస్థితుల్ని అనుకూలంగా మారుస్తారన్న తలంపుతో, హోటల్‌లో చాలా మంది ఆంధ్రావాళ్ళు ఉన్నారు కనుక ఎవరో ఒకరు నాకు సహాయం చేస్తారని నా ప్రయత్నం మొదలు పెట్టాను.

నేను మొదటగా వెళ్ళిన బ్రాంచి హోటల్‌కి వెళ్ళి, మధ్యాహ్నభోజనం చేస్తూ ఆ హోటల్ ఉద్యోగి, రామకృష్ణ, తిరుపతి అతన్ని అడగాలని ప్రయత్నించాను. సహఉద్యోగులు రావడం గమనించి అతను రాత్రి 10.30 గం॥లకు భోజనానికి వచ్చినప్పుడు మాట్లాడదామన్నాడు. రాత్రి భోజనం అయిన తర్వాత నన్ను అతని రూమ్‌కి తీసుకెళ్ళి, వాళ్ళ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్‌కు తాను సిఫార్సు చేస్తానని ధైర్యం చెప్పాడు.





మర్నాడు ఉదయం లేచి కాలకృత్యాలు తీర్చుకొని, పారాయణ చేసుకుని రామకృష్ణని లేపి రెడి అయి, మినర్వా సర్కిల్ హోటల్‌కి వెళ్లాము. 10 గం॥లకు వేరే పని ఉన్నా రామకృష్ణ ఉండి, నా బయోడేటా కూడా తయారు చేయించాడు. 11.30 గం॥లకు రవిగారు (ఇ.డి.) వచ్చారు. వారితో రామకృష్ణ, నేను తనకు తెలుసునని, తిరుపతిలో ఫైనాన్స్ వ్యాపారంలో నష్టపోయి, జాబ్‌కోసం తన దగ్గరకు వచ్చానని ఆయనతో చెప్పి నన్ను వారి దగ్గరకు తీసుకెళ్ళాడు. పిల్లలకు, వాల్తేరుకు దూరమైన నేను శ్రీనివాస్‌గారు (చెప్పిన) గురుదేవులు నన్ను (మనల్ని) చూసుకొనే తీరు (చెప్పినది) ఎఱుకలోకి తెచ్చుకొని, గురుదేవులకు 'నాకేది మంచిదో నేను తేల్చుకోలేక పోతున్నాను, కనుక మీ ఇష్టం వచ్చినట్లు చేయమని' తెలుపుకున్నాను.

రవిగారు నీకు ఉద్యోగానుభవంగాని, అకౌంట్స్‌గానీ, కంప్యూటర్ పరిజ్ఞానంగానీ ఉందా అని అడిగారు. అన్నింటికి నా సమాధానం 'రాదు' అనే. అక్కడ చుట్టుప్రక్కల వెతికిన నాకు బాబా ఫోటో కన్పించింది. అవసరమన్నది బాబా చూసుకుంటారని నాకు నేను ధైర్యం చెప్పకున్నాను. ఒక నిమిషం తర్వాత రవిగారు సరే ఈయన్ని సెంట్రల్ ఆఫీసులో వేద్దాంలే, డిగ్రీ చదువుకున్నారు కదా! ఆఫీసులో అకౌంట్స్ నేర్పమని మేనేజర్‌తో నేను చెప్పానని చెప్పు అని బయోడేటాపైన "Appointed as Accounts Assistant" అని రాసారు. రూ. 1500/- సేలరీ, భోజనం, వసతితో గురుదేవులు నన్ను అనుగ్రహించారు.

'నో వేకెన్సీ' అనే బోర్డు ఉన్న సంస్థలో ఉద్యోగాన్నిచ్చి, నాకు అనుభవంలేని అకౌంట్స్ నేర్పిస్తూ సేలరీ ఇచ్చే ఉద్యోగమిప్పించారు. ఇలా అనుభవంలేని వారిని, హోటల్‌లో అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో వేస్తారని, డ్యూటీ రాత్రి 11గం॥లకు ముగుస్తుందని, అలాంటిది నన్ను సెంట్రల్ ఆఫీసులో వేసారని, రామకృష్ణ తెలపడం సద్గురు అనుగ్రహానికి పరాకాష్ఠ అని తెలుసుకున్నాను. ఇదీ, గురుదేవులు అనేకానేక మందిని 'మిష'ల రూపంలో పాత్రధారులుగా చేసి నాకిచ్చిన అనుభవం. సరి! ఇక అసలు విషయానికొద్దాం! ఇలా కష్టసమయాల్లో అనుగ్రహమే ఆలంబనగా జీవించిన నేను, రెండు నెలల కంటే బెంగుళూరులో ఉండలేక పోయాను. కారణం, నేను నాబిడ్డలకు, వాల్తేరు సత్సంగం గురుబంధువులకు దూరంగా ఉండలేక!

మరల షిర్డివెళ్ళి, గురుదేవులకు వారిచ్చిన ఉద్యోగాన్ని నిలుపుకోలేని అశక్తతను మరల వాల్తేరులోనే ఉంటానని నాకు జీవనోపాధినొసగమని, గురుదేవుల్ని ప్రార్థించి వెనుతిరిగాను.

అయాచితంగా లభించిన సద్గురు అనుగ్రహాన్ని స్వీకరించక, నా ఇష్టాఇష్టాలకు ప్రాధాన్యతనిచ్చినందుకు బాధపడ్డాను. కానీ, మనం ఎప్పుడైతే అలా మన ఇష్టా ఇష్టాలకు శరణాగతి చెందడం మాని, సద్గురువుకు శరణాగతి చెందిన రోజున 'అడుగడుగునా అదియే అభయప్రదం, సాయి భక్తులకు బ్రతుకంతా శోభప్రదం' అన్నది మన జీవితాల్లో నిత్య సత్యమవుతుంది. అలా రోజులు గడిచి, ఎన్నో ఒడిదుడుకుల్ని గురుదేవులు గట్టెక్కించి, నన్ను ఒక చోట స్థిరపరిచారు.

- జనార్ధనరావు





# "సత్సంగమనే మధుర పక్వాన్నాన్ని ఎలా ఆస్వాదించాలో!"

మానవ జీవితంలో సత్సాంగత్యానికి ఉన్న ప్రాధాన్యత అపారం, అవిభాజ్యం. మానవ పరిణామ దశలలో ఎన్నో ఉన్నత ఘట్టాలు, వాటిలో పెక్కు అంశాలకు విజయాధారం సత్సాంగత్యం. అది వివేక, వైరాగ్యాలు రెంటిలో ఏదైనా కావచ్చు. అపారంగా వర్షిస్తున్న గురు అనుగ్రహాన్ని అనుక్షణం (ప్రతి క్షణం) స్వీకరించే శక్తి మనలో పెంపొందటానికి, (వారు చెప్పిన ఉపకరణం కూడా సత్సంగమన్నది) వారి ఉవాచ కూడా సత్సంగమే! కారణం మానవులుగా జన్మించిన మనకు మన చుట్టుప్రక్కల అంశాలతో (Environmental Factors) సంబంధం లేకుండా జీవించడం అసాధ్యం. పూర్వ జన్మసుకృతం, కాదు కాదు కేవలం ఋణానుబంధం వల్ల, కాదు కదూ! కేవలం సద్గురు అనుగ్రహం వల్లే మనకు 'ఆధ్యాత్మికత - నిజజీవితం' రెండూ వేరు కాదని, 'ఇహములోనే పరముచూపెడివారే' అన్న శాస్త్రవాక్యం మన జీవితాల్లో అనుభవమయ్యేలా, చేయగలిగిన సద్గురువు లభించారు.

సాయిభక్తిరససాగరంలోని రహస్యాలను మనందరికీ పంచిన గురుస్మరణలో సత్సంగాన్ని చక్కగా నిర్వహించుకుందాం. తనకు తెలిసిన జ్ఞానమునకు సంబంధించిన అనుభూతి కలవారే బ్రహ్మనిష్టులు - వారే సద్గురువులు. స్వానుభూతితో మనకు గురుదేవులు ప్రసాదించిన మహితవరం 'సత్సంగం'. అట్టి సత్సంగంలో 'నామస్మరణ', ఆంతర్యంలో అనుక్షణం 'సద్గురువు' నిలిచేందుకు తోడ్పడుతుంది. కర్మలలో (నిత్యకృత్యాలలో) సాగుతూ ఉండినా, చిత్తంలో గురువుతోడై ఉండేందుకు తోడ్పడుతుంది. గురుబోధ అందిన వాడు గురుతు లేకుండా పోతాడట. గుహ్యమై ఉంటాడట. గురుబోధ (సత్సంగోచ్ఛిష్టం) రుచికలిగి ఉండకపోయినను, సారవంతమైన ఉచ్ఛిష్ఠాన్ని (గురు ఉచ్ఛిష్ఠాన్ని) పంచే వెలలేని అమూల్యమైన వరం సత్సంగం. ఆస్వాదించిన వ్యక్తికి నగరమైనా, వనమైనా ఒక్కటే. జన సమ్మర్ధములో ఉన్నా, ఏకాంతములో ఉన్నా అతడు ఒక్కడే. అతని అనుభూతి ఒక్కటే. అట్టి సత్సంగమనే భాండాగారంలోని మధుర పక్వాన్నాన్ని మనం ఎలా స్వీకరిస్తున్నాం, ఆస్వాదిస్తున్నాం. ఈ అంశాలను డా॥ శ్రీనివాసులరెడ్డిగారు శిరిడిలో చేసిన సత్సంగం నుండి పునశ్చరణ చేసుకుందాం. నిర్ణయించుకున్న సమయం ప్రకారం (నిర్ణీత కాలంలో) జరుగుతున్న సత్సంగాలకు ఆయా ప్రదేశాలలోని గురుబంధువులందరం వెళుతుంటాము. అలాగే సాయియానాలో 7 గం॥లకు జరిగే సత్సంగానికి, గురువుగారి దర్శనం కోసంగాను మనం శిరిడిలో గడుపుతుంటాం. అలా 7గం॥లకు సత్సంగం ప్రారంభం అవుతుంది అంటే అవకాశం వున్న వాళ్ళు ముందుగానే వచ్చి బాబా సన్నిధిలో కూర్చోని, ఆ సన్నిధిని అనుభవించడం ద్వారా మన మనస్సు బాబా పరంగ ట్యూన్ అవుతుంది. అప్పటివరకు ప్రాపంచికమైన వ్యవహారాలతో గడిపివుండటం వల్ల మనసు వెంటనే బాబాపరంగా ట్యూన్ అవ్వడానికి సమయం పడుతుంది, మన మనస్సు. (7గం॥లకు సత్సంగం

అంటే 6.59 ని॥లకు రావటం కాకుండా) అలా సత్సంగానికి ముందుగా రావడంవల్ల సత్సంగ ప్రారంభసమయానికి మనం మన మనస్సుతో సిద్ధం కాగలం. సత్సంగం అయ్యాక కొందరికి బయటకు పోవటానికి బుద్ధిపుట్టదు, వారు ప్రశాంతంగా కూర్చోవడమే. ఆరతికి ప్రత్యేకంగా లేవాలి అనే నియమాలు లేవు. అలానే గురువుగారు స్టేజ్ మీద దర్శనమిచ్చి వెళుతున్న సందర్భంలో కూడా మనస్సులో ఆ భావనతో ప్రశాంతంగా కూర్చోవడమే, తప్పక లేవాలి అన్న నియమాలేవి లేవు. ఆ తరువాత కూడా కొంత సేపు అక్కడ కూర్చోవడం ఆ సన్నిధిని మననం చేసుకోవడం అవసరం.

దీనినే మనం ఇలా అర్థం చేసుకోవచ్చు. సత్సంగం అంటే అన్ని పదార్థాలను సేకరించుకోవడం లాంటిది. ఆ పదార్థాలతో వంట చేసుకోవడం భజన అయితే, దాన్ని తినడం లాంటిది ధ్యానం అని చెబుతారు.

మనం అన్ని రకాల పదార్థాలను సేకరించుకొంటాం. చక్కగా వంట చేసుకుంటాం. హాయిగా పారేసుకొని వెళ్ళిపోతుంటాం. చిందరవందర చేసుకొని తినం. ఆ తినడం లాంటిదే గురువుగారు వెళ్ళాకకూడా మనస్సుని అదే స్థాయిలో వుంచుకొని కొంతసేపు అక్కడగడపడం. సత్సంగ మందిరంలో - సత్సంగానికి ముందు - సత్సంగం తరువాత చాలా ముఖ్యం. సత్సంగం కాని, గురుదర్శనం కాని అయిపోగానే, హడావిడిగా స్కూలు పిల్లలు స్కూలు వదలగానే వెళ్ళిపోయినట్లు కాకుండా - ముందుగా రావడం మనస్సుని ట్యూన్ చేసుకోవడంగా ఉపయోగపడితే, అయ్యాక కూర్చోవడం మనస్సుని ఆ స్థాయిలో నిలుపుకోవడానికి ఉపయోగపడుతుంది.

**గురుబంధువులు తమ అనుభవాల్ని Internet ద్వారా పంపడానికి**
**leelas@guruji.org కి mail చేయగలరు.**

**మీ అనుభవాలు, పత్రికకు మీరిచ్చే సలహాలను సాదరంగా ఆహ్వానిస్తుంది "గురుకృప". మీ వ్యాసాలను, అనుభవాలను 15వ తేదీ డిశంబరు, 2003 లోపు క్రింది చిరునామాకు పంపిన జన్మదిన సంచికకు స్వీకరింపబడతాయి. తరువాత వచ్చే వాటిని శ్రీరామనవమి సంచికకు స్వీకరించబడతాయి.**

**'గురుకృప' - 22-1-50, జి.వి.కాంప్లెక్స్, గాంధీచౌక్, తెనాలి - 522 201**
**'గురుకృప'- సాయివరప్రాసాదం, సత్యనారాయణ వీధి, రామలింగేశ్వర పేట, తెనాలి - 522 201**

**ఇంటర్ నెట్‌లో "గురుకృప" - Visit : www.guruji.org**





# సుఖంతో సౌఖ్యానికి బాట - ఆ బాటే గమ్యం చేర్చు

**ప్రపంచంలో తల్లి-బిడ్డల బంధాన్ని చాలా ఉన్నతంగా చూడటం గమనిస్తాం. కానీ, మనం గమనించాల్సింది దాని వెనుక ఆంతర్యం. తన ప్రేగు తెంచుకు పుట్టిన బిడ్డ యొక్క అన్ని అవసరాలను సైగల భాష నుంచి, జీవిత పర్యంతం గమనించుకుంటూనే ఉంటుంది తల్లి. అందుకే మసీదుకు ద్వారకామాయి అని బాబా నామమిచ్చింది. ఈ తల్లి ద్వారం వద్ద ఎదురుచూస్తుందిట, ఎప్పుడు బిడ్డ అలసిసొలసి వస్తాడోనని. బాబా తత్త్వ నిజరూపమైన గురూజీ తన బిడ్డ అలవడమే ఇష్టం లేకుండా, పరిస్థితుల్ని అనుకూలంగా మార్చడం గమనిద్దాం. మనకు అద్భుతంగా తోచే సద్గురులీల, వారి దృష్టిలో కేవలం తల్లి "లాలనే" అన్న బాబూజీ మాట శృతివాక్యమే! సద్గురు అనుగ్రహం, రక్షణలు ఆకాశం నుండి ఊడిపడక, సాటి వ్యక్తుల నుండే వ్యక్తమవుతుంది. సద్గురు వాక్యం అక్షర సత్యం. ఇక బాబా చరితకొద్దాం. పగిలిన బాబా పటానికి అద్దం వేయించిన తర్వాత తన లీలా వినోదంలో భాగంగా ఆ పటాన్ని దీక్షిత్, మిరీకర్ తీసికొని బయల్దేరుతారు. టిక్కెట్లు తీసుకున్న వారికి సెకండుక్లాసులో జాగా దొరకదు. స్నేహితుడైన గార్డు రూపంలో కనిపించి బాబా వారిని ఫస్టుక్లాసులో కూర్చొండబెట్టి గమ్యస్థానానికి సుఖంగా చేరుస్తారు. అయితే స్వప్నగారి కుటుంబం సుఖంగా వారి గమ్యానికి చేరడానికి నిజమైన గార్డు గురూజీయే.. - గురుకృప.**

బాబా పాదములకు, గురువుగారి పాదములకు నమస్కరిస్తూ నాకు కలిగిన అనుభవాలను గురుకృప ద్వారా గురుబంధువులతో పంచుకోవడానికి సంతోషిస్తున్నాను. మా కుటుంబం అంతా కలసి అంటే నేను, అమ్మ, చెల్లెలు ముగ్గురం కలసి శ్రీరామనవమికి శిరిడి వెళ్ళాము. అప్పడే మాకు రెండు అనుభవాలు గురువుగారి దయ వలన కలిగినాయి. మొదటిది శ్రీరామనవమి రోజు గురువుగారు 'సాయిపథము' నుండి 'గురుచరణ్' కు మారినారు. అయితే అందరూ గురువుగారు ఎలా వెళ్తారో అని ఆతురతగా ఉన్నారు. అందరిని ఆనందింపచేయటానికి, గురువుగారిని అందరూ 10ని॥ పాటు చూడగలందుకోసమా అన్నట్లు గురువుగారు నడచివెళ్ళారు. ఆయనకోసం వేసిన కార్పెట్ కూడా తీసివేయమన్నారు. అసలు ఆ పది నిమిషాలు ఎలా గడిచినవో తెలియదు. గురూజీ అందరినీ చూసుకుంటూ నెమ్మదిగా నడిచారు. ఈ సంఘటన జీవితంలో ఎప్పటికీ మరువలేనిది.

మా తిరుగు ప్రయాణానికి రిజర్వేషన్ లేదు. నాగర్‌సోల్‌లో సికింద్రాబాద్ వెళ్ళే రైలు ఎక్కాల్సివుంది. మేము ముగ్గురం ఆడవాళ్ళం, కనుక రిజర్వేషన్ కోసం ప్రయత్నం చేసాం కాని దొరకలేదు. ఇక మేము స్టేషన్‌లో టిక్కెట్లు ఇచ్చే ఆయన్ని అడిగితే మీరు S4లో కూర్చోండి అన్నారు. అంతా టి.సి. చూసుకుంటారు అన్నారు. మేము ఆయన మాట మీద నమ్మకముంచి వెళ్ళి కూర్చున్నాము. అయినా మాకు భయంగానే ఉంది. దానికి తగ్గట్టే దాని తరువాత 1,2 స్టేషన్స్‌లో మేము కూర్చున్న సీట్లలో వాళ్ళు వచ్చేశారు. మేము మా సామానుతో అలా నిలబడి పోవాల్సి వచ్చింది.



కొంచెం సేపు తరువాత టి.సి. వచ్చారు. ఆయనకు చెప్పాము. ఆయన కూడా నా చేతిలో ఏమీ లేదు. ఔరంగబాద్‌లో ఎవ్వరు రాకపోతే మీరు కూర్చోవచ్చు అన్నారు. ఒక్కసారి ఆలోచిస్తే మేము ఎంత కష్టంలో ఉన్నామో అర్థం అయినది. ఎవరైనా వస్తే మేము కనీసం 5 బోగీలు దాటి జనరల్‌కి వెళ్ళాలి. పైగా సామాన్లు కూడా ఎక్కువ. ముగ్గురం ఆడవాళ్ళమే. ఆ సమయంలోనే గురువుగారు మమ్మల్ని కాపాడారు. పెద్ద గండం నుంచి గట్టెక్కించారు. మేము కూర్చున్న సీట్ల వరకు దాదాపుగా ఎవ్వరూ రాలేదు. ఔరంగబాద్‌లో కనీసం 5గురు, తరువాత స్టేషన్‌లో ఇంకొంత మంది ఎక్కాల్సి వుంది. మా వరకు మాత్రము ఎవ్వరూ రాలేదు. గురువుగారి దయవలన ఆ రాత్రంతా హాయిగా ప్రయాణించగలిగాము. తండ్రిలాగా వెన్నంటి ఉండి మమ్ములను కష్టానికి లోనుకాకుండా గమ్యానికి చేర్చిన గురుదేవులకు మా పాదాభివందనం.

పి. స్వప్న, తెనాలి ❊

## ఆ చేయి ఎంత హాయి

"సత్యాన్నంటి పెట్టుకొనండని" బాబా అన్నారు. సత్సంగాలు బాగా చేస్తాడను పేరున్న ఒకాయన్ను కొందరు గురుబంధువులు శిరిడీలో కల్సుకున్నప్పుడు "సత్యాన్నంటి పెట్టుకొని ఉండటమంటే" ఏమిటని అడిగారు. నానావళి సమాధి దగ్గర రాత్రిపూట 1గం॥ ప్రాంతంలో సత్సంగం ప్రారంభమైంది. సత్యమంటే ఏమిటో దేన్ని సత్యమంటారో, సత్యవాక్పాలన మంటే ఏమిటో పురాణాలు, ఇతిహాసాలు, ఉపనిషద్వాక్యాలనాధారంగా వివరించారు. అందరు చాలా బాగుందన్నారు. చెప్పినాయన గూడా హుషారుగా పొంగిపోయాడు. ఆ మరుసటి రోజురాత్రి కందుకూరి నుంచి వచ్చిన గురు బంధువడిగాడు గురువుగార్ని, "సత్యాన్నంటి పెట్టుకోవడమంటే ఏమిటని" ఒక్క నిముషమైనా! వ్యవధానం లేకుండా గురువుగారు నిరంతరం మనల్ని బాబా అంటిపెట్టుకొని ఉంటారనేది సత్యమన్నారు. మన వెంట బాబా ఎప్పుడూ ఉంటారనేది సత్యమన్నారు. బాబా ఉన్నారన్నది సత్యమన్నారు. దాన్ని మనం గుర్తించగలగడమే సత్యాన్ని అంటి పెట్టుకోవడమంటే." అని సమాధానమిచ్చారు అమృతజల్లు వర్షింపచేస్తూ.

రాత్రి నానావళి సమాధి దగ్గర వినిన దానికి గురువుగారు చెప్పిన దానికి ఎంత వ్యత్యాసముంది. గురువుగారి సమాధానములో బాబాపట్ల ప్రేమ వ్యక్తమౌతున్నది. రాత్రి వినిన సమాధానములో లౌకికమున్నది. గురువుగారి సమాధానములో పూర్తిస్థాయిలో పారమార్థికత దాగున్నది. రాత్రివినిన సమాధానములో ప్రశ్నకు అతికించి చెప్పబడిన జవాబు ఉంది. గురువుగారి సమాధానములో, తృప్తి, సంతృప్తి, హాయి, వాస్తవము, బాబాపై పెరిగేటి ప్రేమ, భక్తిశ్రద్ధలు, ఇమిడి ఉన్నాయి. రాత్రి వినిన సమాధానము పై పై మెరుగు - ఎండలో మెరిసే ఆల్చిప్ప. గురువుగారిచ్చిన సమాధానం, బాహ్యానికి, ఆంతర్యానికి సంబంధమున్నది. గురువుగారిచ్చిన జవాబు అంతఃశుద్ధి చేసి బాహ్యశుద్ధిగావించు తీర్థము వంటిది. దట్టమైన చీకటిలో గూడా ప్రకాశించు మాణిక్యము వంటిది. అంతరేంద్రియశక్తిని పెంచునట్టిది. సామాన్యుని మాటకు, అసామాన్యుని మాటకు ఎంత





తేడా వుంది. మొదటి వారిది తాత్పర్యమైతే. రెండవవారిది విశ్లేషణ, వ్యాఖ్యానం. మొదటిది పాండిత్యమైతే, రెండవది అనుభవం. పాండిత్యం కన్నా అనుభవమే మిన్న. అందుకే వారు జ్ఞానస్వరూపులు. ఆ మరుసటి రోజు శిరిడీలోనే గురువుగారు చెప్పిన సమాధానాన్ని మననం చేసికొని బాబా చరిత్రవైపుకు అన్వయించుకోవాలి, ఇది ఎక్కడో ఉండి తీరుతుంది. గురువుగారు మనకు పరీక్ష పెట్టారు. అని నాకుగానేను భావించుకొని బాబాపరంగా అన్వయం కుదిరితే గురువుగారి భావాన్ని అర్థం చేసికొన్న వాడనైతాను. లేకుంటే వ్యర్థుణ్ణేకదా? అని చింతిస్తున్నాను. సరిదీటుగా, సరి సమాధానంగా సరిపోయే సన్నివేశం సందర్భాని కనుగుణంగా స్మృతిపథంలోకి నెట్టారు గురువుగారు. హేమాద్పంతుకు శనగల విషయంలో బాబా చెప్పిన మాటలు జ్ఞప్తికి వచ్చేసరికి ఎంతో సంతోషమైంది.

- ఎస్. సాయివరప్రసాదరావు, లీడరు, రేపల్లె.

(మరిన్ని విషయాలు వచ్చే సంచికలో)

## మహనీయుల మహితోక్తులు

## అడుగులోన... అడుగడుగున...

సుమారు పండ్రెండు సంవత్సారాల నాటి మాట. ఆ రోజున జరిగిన సంఘటన నాకంటి ముందు జరిగింది. నాకింకా గుర్తు వుంది. గురువుగారు శిరిడీలో రేకుల షెడ్డులో చాలాకాలము అద్దెకు ఉన్నారు. ఆ రోజుల్లో వారిని కలవాలని, వారి ఆశీర్వచనం పొందాలని, (లేదా) తాము చేయబోవు వ్యాపారమో! వ్యవహారమో! వ్యక్తిగత అవసరాలనో వారి దృష్టికి తీసికొని వెళ్ళాలని వచ్చేవారి సంఖ్య అధికంగానే ఉండేది. అప్పటి ప్రజల అదృష్టమేమంటే గురువుగారు నెలలో ఇరవై రోజులకు తక్కువ కాకుండా రాత్రిపూట ఎక్కువగా బాబాను గూర్చి, బాబా లీలలను గూర్చి, బాబా చర్యలను గూర్చి  చెప్పేవారు. కొందరికి చరిత్ర పరంగానో, పారాయణ పరంగానో, సందేహాలుంటే నివృత్తి చేసుకొనే వారు, గురువుగారిని అడిగి. ఒక్కొక్క సమయంలో ఇతిహాసాలు, వేదాలు, వేదాంత గ్రంథాలు, ఆంధ్ర, ఆంగ్ల, సంస్కృత, భాషా సాహిత్యము, ఎందరో విమర్శకులు, రచయితలను గూర్చి చెప్పేవారు. మూర్తీభవించిన విజ్ఞాన సర్వస్వ స్వరూపంగదా అది. తామేది చెప్పినా చివరకది బాబాకు ఎలా అన్వయించబడిందో వింటే అపురూపమనిపించేది ఆనాటి కాలం వారికి. హేమాండ్‌పంతు గారనినట్లు, మళ్ళీ ఆరోజులు రావేమో! ఆనందంగా పసిపిల్లవాడు తల్లిఒడిలో చనుబాలు త్రాగుతూ పరవసిస్తూ, ఆడుతూ, హాయిగా నిద్రించే స్థితిలాంటివారోజులు. మళ్ళీ అలాంటి రోజులు రావాలని ప్రార్థించుదాం.

గురువుగారంటే అభిమానం, గౌరవం, ప్రేమ, భక్తిశ్రద్ధలు, చనువు, ఇత్యాదిగల వారందరున్న ఒకానొకరోజున గురువుగారు చక్కని సత్సంగం రేకుల ఇంట్లో చేస్తున్నారు. తొమ్మిది దాటిందను కుంటాను. “సార్ తొమ్మిది దాటింది నాకు నిద్రపోయేటైము, వస్తానని నమస్కరించి ఊది పెట్టించుకొని వెళ్లిపోయాడు. మధ్యలో తనకారణంగా “సత్సంగం బ్రేక్” అవుతుందని అప్పట్లో



సాయివరప్రసాదరావు ఊహించలేక పోయాడు. ఇదే విధంగా రెండు రోజులు పైమాదిరిగానే తొమ్మిది దాటగానే సాయివరప్రసాదరావు గురువుగారి సత్సంగానికి అంతరాయం కల్గించి, గురువుగారు చెప్పే మహనీయమైన విషయాలు వినకుండా వెళ్లిపడుకొనేవాడు. (యస్. సాయివరప్రసాదరావుగారు క్షమించాలి. క్షమిస్తారనే వ్రాస్తున్నాను)

ఆ మరుసటిరోజు మరల గురుదేవులు సత్సంగం చేస్తున్నారు. మధ్యలో సందర్భానికి, సమయానికి, చెప్పే అంశానికి సహజాతిసహజంగా అతికేలా! ఇలా అన్నారు. “సాధారణంగా కొందరు రెండవ ఆట సినిమాలకు వెళ్లి రెండు గంటలదాకా మేల్కొనగల్గుతున్నారు. నాటకాల మీది అభిమానంతో రాత్రంతా మేల్కొనగల్గుతున్నారు. టి.విలో రక్తసంబంధం వంటివో, ఎన్.టి.ఆర్. సినిమాలైతే పండెండు గంటల దాకా చూడగల్గుతున్నారు. ఇలా ఉండగల్గిన వారు శిరిడీలో మాత్రం బాబాను గూర్చి మంచి విషయాలు వినే సమయంలో టైం ప్రకారంగా తొమ్మిది గంటలకే నిద్రపోయే వారిలా! ఆరోగ్యాన్ని కాపాడుకొనే వారిలా మాట్లాడి వెళ్లిపోతారు. అసలు మనమిక్కడకు ఎందుకు వచ్చామో! ఏం సాధించాలని వచ్చామో! ఏంచేయాలని వచ్చామో! మర్చిపోయి వివరణలేకుండా, విపరీతంగా, వింతగా ప్రవర్తిస్తాము. నిద్రే ముఖ్యమనుకుంటే శిరిడీ దాకా రావాలా! ఆపని వాళ్ల ఊర్లోకూడా చేయవచ్చునే! పైకి మాత్రం మేం శిరిడీ వెళ్లాం. పదిరోజులున్నామని గొప్పలు చెప్పకోటానికే తప్ప. పదిరోజులుండి బాబా సన్నిధిలో మనం సాధించిందేమిటి? పొందిన అనుభవాలేమిటో? ఆలోచించండి. నిజం చెప్పాలంటే శిరిడీలో కుక్కలుకూడా రాత్రిపూట రెండుగంటలదాకా మేల్కొనే ఉంటాయి. కావాలంటే చూడండి అన్నారు. వ్రాసేవిధానం తెలియక, వ్రాయనలవికాని వాక్యాలలో కఠినం ఉందికాని, గురువుగారు చెప్పినధోరణిలో ప్రేమ, లాలన, ఆప్యాయత, అనురాగం ఆ వ్యక్తి అభివృద్ధి పట్ల కాంక్ష ఇత్యాదులే అధికంగా ఉన్నాయి. చక్కని ఆవు జున్ను, పండిన చెక్రకేళి, అమృత ఫలం, పటిక బెల్లం, యాలకలు, తేనె, ఆవుపాలు, కొద్దిగా కలిపిన పచ్చకర్పూరంతో తయారైన చక్రపొంగలి, నిన్న చేసిన చిత్రాన్నం కంటే గూడా ఎంతో రుచిగా, చక్కగా, ఎలాచెపితే ఆ జీవికి కష్టం కలగకుండా అర్థమవుతుందో అలా వివరించారు. సాయివరప్రసాదరావు ఆరోజు లేస్తారని చూచాను. ఆరోజునుంచి వారు తొమ్మిదింటికి శిరిడీలో నిద్రించిన దాఖలాలు లేవు. ఈ మధ్య పదిరోజులక్రితం అడిగినాము. రెండో ఆట సినిమాలకు, డ్రామాలకు వెళ్తున్నారా అంటే? గురువుగారి పుణ్యమాని ఈ రోజు వరకు వెళ్లలేదనినాడు. ఇలా వ్యక్తి వ్యక్తిని సంస్కరించి సాయినాధుని పదసన్నిధికి చేర్చేదాకా గురూజీ అవిశ్రాంతంగా ఇలా పాటు పడుతుంటారనటంలో సందేహంలేదు. అందుకే సద్గురుని శరణు జొచ్చిన వారికి చింతలకు తావుండదు. మనగమ్యమేమిటో తెలియక పోయినా! ఆయనే వారిని చేయిపట్టి నడిపిస్తారు.

**అడుగులోన అడుగువేయించి, అడుగడుగునకు సముదాయించి**
**అండగా దండియై దయామయుడై, నడిపించు గమ్యానికి జన్యసముడై**

(భక్తిభరిణెనుండి)

సమర్పణ : గురుచరణదాసుడు





# స్వర్ణోత్సవ సుమంగా మనం ఏం సమర్పిద్దాం?

సద్గురు అవతార కార్యక్రమానికి ఆరంభమెప్పడు? అంటే సమాధానం! ***నా వరకు నేను జన్మించింది ఎప్పడు... అంతకు ముందు మాత్రం నేను లేనా! అన్న సద్గురు వాక్యమే. ఇప్పడు, అప్పడు అని కాక ఎల్లప్పడూ, ఎల్లెడలా తన అనుగ్రహం ఉండనే ఉందని తెలియచెప్పారు బాబా.*** బాబా యొక్క వాణిని, సాన్నిధ్యాన్ని ప్రసాదిస్తూ, వారి అవతార కార్యక్రమానికి రధసారధియై మనకు సాయిమార్గాన్ని చూపిస్తున్న ఈ సమర్ధసద్గురువుకు జన్మదినమా? ఒక వేడుకా?.. మన జ్ఞానానికి (విజ్ఞతకు) అంది నంతలో సద్గురు అవతార కార్యం 1954వ సం॥లో ప్రారంభమయ్యింది. నిత్యకృత్యాలలో, జనజీవన స్రవంతిలో మునిగిపోయిన మనం, సద్గురువు మనకు అందించిన ఉపకరణాలను సద్వినియోగ పరుచుకుంటూ వివేకానుగ్రహాలను మరొక్కసారి పునశ్చరణ చేసుకొని, కృతజ్ఞతతో మనం వారి పాదాల చెంత 'దక్షిణ' ను సమర్పించుకోవడానికే - ఈ ప్రతి జన్మదినోత్సవ వేదిక - వేడుక. అయితే మరి ఎన్ని పుష్పాలు, ఫలాలు, రూపాయలు సమర్పించుకుందాం. ఒక వంద... వెయ్యి... లక్ష... కోటి... క్షమించాలి, చాలడం లేదు కదా? సమర్పించుకోలేం కదూ! సద్గురువు అనుగ్రహంతో మనకు ప్రసాదిస్తున్న వివేక మననాలతో గురుదక్షిణ సమర్పించుకొనే చిరుప్రయత్నం మొదలెడదామా... మనమందరం. ఈ చిరు ప్రయత్న సాఫల్యత కోసం గురుదేవులను ప్రార్థిద్దాం.

ఈ మధ్య గురుదేవులతో జరిగిన సత్సంగంలో 'సార్ మనకు (బాబా భక్తులమని భావిస్తున్న), ఇతరులకు తేడా ఏమిటి?' అన్న ప్రశ్నకు వారి సమాధానం - బయట 'వాళ్ళే ఇంకొంచెం చక్కగా ఉన్నారేమో' అన్న సమాధానం మనకు కనువిప్ప కల్గించాలి. ***మన వేషభాషల వల్ల కాదు మనం "బాబా భక్తుల" మని తెలియాల్సింది, మన ఆచరణ వల్ల అని బాబా పథాన్ని విస్పష్టంగా తెలియపరిచిన గురుదేవుల వాణే*** మన ఆచరణకు నాందిగా, వారి అడుగుజాడల్లో తండ్రికి తగ్గ బిడ్డలుగా వుండే ప్రయత్నం చేద్దాం. మన ఆచరణ ద్వారా 'వీళ్ళు శరద్బాబూజీ' గారి పిల్లలు అయివుంటారు అని తెలుసుకొనేట్లు ప్రవర్తిద్దాం. వారి అనుగ్రహమనే వర్షపుజల్లు కురవడం ఎప్పడో ప్రారంభమయ్యింది. అయితే మనమిక్కడ తడుస్తామేమోనని ఇంట్లోకి దూరి, కనీసం వారి అనుగ్రహపు చిరుగాలి కూడా మనలను తాకకుండా కిటికీతలపులతో సహా మూసివేసుకున్నాము. ఆ చిరుగాలిని ఆస్వాదించటానికై కిటికీ తలుపుల్ని తెరిచి వుంచుదాం. ఆస్వాదించడమంటూ మొదలెడితే, ఆ జడివానలో తడిసి, ముద్దవ్వడానికి ఇక ఆలోచించం. అయితే ఇక ఆలస్యమెందుకు, ఈ విజయదశమే ప్రారంభానికి శుభదినం. సద్గురు చంద్రుని దర్శనం చేసుకున్న సమయమే శుభఘడియ. సద్గురు అనుగ్రహాన్ని అందిపుచ్చుకొని మనమందరం జరుపుకుంటున్న గురుదేవుల జన్మ దినోత్సవ వేడుకలను రాబోయే (2004 విజయదశమి) 'స్వర్ణోత్సవ వేడుక' కు నాందీప్రస్తావనగా చేసుకొని, వ్యయంతో కూడిన కుసుమాలను, ఫలాలను కాక, వివేకంతో మానవత్వమనే ప్రేమ కుసుమా లను, ఫలాలను సమర్పించుకుందాం.

- గురుకృప ❀